క్లుప్తంగా

ఆకట్టుకున్న నాటికలు



ఏకపాత్రలో కళాకారుడు

చినగంజాం: ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న భారతీయం కళార్చన కార్యక్రమంలో సోమవారం రాత్రి నిర్వహించిన కోలాటం, ఏకపాత్రాభినయం, నాటికలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ముందుగా ఇంకొల్లు ఎస్ఆర్ అండ్ వీఎస్ఆర్ బాలికోన్నత పాఠశాల విద్యార్థుల కోలాట ప్రదర్శన, ఒంగోలు వారిచే నృత్య ప్రదర్శన, ఈలపాట అర్జయ్య ప్రదర్శన, దశరథ, తిప్పడు ఏకపాత్రలు, శ్రీకృష్ణుని అవతారం ఏకపాత్ర, తదుపరి రాతిలో తేమ వంటి నాటికలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

1998 మెమో రద్దు చేయాలి

చీరాల రూరల్: గత ప్రభుత్వంలో ఇచ్చిన 1998 మెమోను ప్రస్తుత ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని పలువురు పాస్టర్లు, ప్రజా సంఘాల నాయకులు ముక్త కంఠంతో పేర్కొన్నారు. ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మడి ఏసురత్నం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మసీదు సెంటర్లోని కార్యాలయంలో పాస్టర్లు, ప్రజా సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం ఏర్పాటు చేసిన హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని వారు మండిపడ్డారు. తక్షణమే చీకటి మెమోను రద్దు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాస్టర్లు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తిరగబడిన గ్రానైట్ లారీ



రోడ్డు మీద అడ్డంగా తిరగబడిన ట్రాలీ

అద్దంకి రూరల్: గ్రానైట్ లారీ తిరగబడిన ఘటన మండలంలోని గోవాడ పరిసర ప్రాంతంలో జరిగింది. స్థానికుల సమాచారం మేరకు..బల్లికురవ మండలంలోని కొమ్మినేని వారిపాలెం నుంచి అద్దంకి వైపునకు గ్రానైట్ ట్రాలీని తీసుకుని వస్తుండగా మార్గ మధ్యంలోని గోవాడ దగ్గరకు రాగానే ట్రాలీ అదుపు తప్పి రోడ్డుకు అడ్డంగా తిరగబడింది. ఈ ఘటనలో గుర్తు తెలియని వ్యక్తికి గాయాలయ్యాయి. లారీ దిగి ఆ డ్రైవర్ పరారయ్యాడు.


కబడ్డీ విజేత టైగర్స్ జట్టు



ప్రథమ బహుమతిని అందజేస్తున్న శ్రీనివాసరావు

అద్దంకి: ఫ్రెండ్స్ కబడ్డీ క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 13 నుంచి నిర్వహించిన కబడ్డీ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీల్లో తిమ్మాయపాలెం టైగర్స్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి 15 జట్లు హాజరయ్యాయి. ప్రథమ స్థానంలో నిలిచిన తిమ్మాయపాలెం టైగర్స్ జట్టుకు చాగంటి శ్రీధర్ రూ.15,116, రెండో స్థానంలో నిలిచిన గంగసపాలెం జట్టుకు అడుసుమల్లి భారతి శ్రీనివాసరావు రూ.10,116, మూడో స్థానంలో నిలిచిన గుర్రాల కాలనీ అద్దంకి జట్టుకు అడుసుమల్లి శ్రీనివాసరావు రూ.7,116, నాలుగో స్థానంలో నిలిచిన దామావారిపాలెం జట్టుకు గండు వెంకట్రావు రూ.5,116 అందజేశారు. పోటీలను వేణు, జీ మణి, మద్దు సురేశ్, కాశి, అశోక్, వై వాసు పర్యవేక్షించారు. జట్టు సభ్యులకు కూకట్ల ఫౌండేషన్ క్రీడా దుస్తులు అందజేశారు.

వేగం కన్నా ప్రాణం ముఖ్యం



పంపిణీ చేసిన హెల్మెట్లతో వాహనదారులు

అద్దంకి: వాహనం నడిపే సమయంలో వేగం కన్నా భద్రతే ముఖ్యమని ఎస్సై నాగ శివారెడ్డి అన్నారు. నామ్ ఎక్స్‌ప్రెస్ హైవే వారి ఆధ్వర్యంలో సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు తోల్ గేట్ వద్ద వాహనదారులకు సోమవారం ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతి ద్విచక్రవాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాద సమయంలో ప్రణాలకు భద్రత ఉంటుందన్నారు. హెల్మెట్‌లను పంపిణీ చేసిన దాతలను ఆయన అభినందించారు.

వీధివీధినా సంక్రాంతి సంబరాలు



చీరాల: గోపూజ చేస్తున్న రామానంద సరస్వతి



రామాపురంలో ముగ్గుల పోటీల్లో మహిళలు



దేశాయిపేటలో ముగ్గుల పోటీల్లో బహుమతి అందుకుంటున్న మహిళలు

వేటపాలెం/చీరాల: ఏవీధి చూసినా రంగవల్లులే, ఆటల పోటీలు, ఆకాశం నిండా గాలిపటాలు, ఇంటి నిండా బంధువులు, పిండివంటలతో సంక్రాంతి సంబరాలు ఈఏడాది అంబరాన్నంటాయి. ఆదివారం సంక్రాంతి, సోమవారం కనుమ పండుగలను చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చీరాలలోని నల్ల గాంధీ బొమ్మ వద్ద మహాలక్ష్మీమ్మ అమ్మవారి మందిరం వద్ద సంక్రాంతి కనుమ పండుగను పురస్కరించుకొని గో పూజోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి స్వామీ రామానంద సరస్వతి ముఖ్య అతిథులుగా హాజరై గోపూజ చేశారు. కార్యక్రమంలో మహా లక్ష్మమ్మ కమిటీ సభ్యులు ఎంజీ శకంరరావు, చింతా రమేష్‌బాబు, ఇందేటి వాసుబాబు, కొమ్మన బోయిన లక్ష్మణరావు, చందనం రాము, నారాయణ సురేష్ పాల్గొన్నారు.

➤ వేటపాలెం మండల పరిధిలోని సంక్రాంతి పండుగను ఆదివారం వైభవంగా నిర్వహించుకున్నారు. వీధివీధిన హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ప్రదర్శనలు, ముగ్గుల పోటీలు, పిండివంటల పోటీలు, సంప్రదాయ కోడిపందేలు, రైతులు ఎడ్ల పందాలు, యువత గాలిపటాలతో గ్రామాల్లో పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. మత్స్యకార గ్రామం రామాపురంలో ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మత్స్యకార మహిళలకు ముగ్గుల పోటీలు, దేశాయిపేటలో దేవల మనోబ్రహ్మ దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఫౌండేషన్ సమన్వయకర్త శవనం చంద్రారెడ్డి, పెద్ద కాపులు ఆవుల శ్రీను, లక్ష్మయ్య, జాలయ్య, విశ్రాంత ప్రిన్సిపల్ సత్రం మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

గోమాతలో సకల దేవతలు..

బల్లికురవ/జేపంగులూరు/మేదరమెట్ల/అద్దంకి రూరల్: గోమాతను పూజిస్తే సకల దేవతలను పూజించినట్లేనని రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు అన్నారు. కనుమ పండగ సందర్భంగా సోమవారం గో సంరక్షణ సమితి, రోటరీక్లబ్ ఆఫ్ శిగరకొండ, హరహర గోకుల సంక్షేమ సంక్షేమ సంస్థలు గోవులకు అర్చకుడు వెంకటాచారి భక్తులతో పూజా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, మురళీ సుధాకర్, పీఎల్వీ నరసింహారావు, గొట్టిపాటి సత్యనారాయణ, మాలాది శ్రీనివాసరావు, తమ్మన శ్రీనివాసరావు, మన్నం త్రిమూర్తులు, దేశు పద్మేష్, తదితరులు పాల్గొన్నారు.

➤ బల్లికురవ మండలంలోని మల్లాయపాలెంలో మాజీ సర్పంచ్ అబ్బారెడ్డి బాలకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్దపాటి శంకర్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. 16 మంది మహిళలు పోటీల్లో పాల్గొన్నారు. మొదటి బహుమతి రూ. 10,116ను ముద్దపాటి శంకర్, రెండో బహుమతి రూ. 5,116ను జూపల్లి రామయ్య, మూడో బహుమతి రూ. 3116ను మర్రి వెంకటేశ్వర్లు, సాంబశివరావు అందజేశారు. కొండాయపాలెం కోదండ రామాలయంలో కక్కెర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. గంగపాలెం, వల్లాపల్లి, అంబడిపూడి గ్రామాల్లో కూడా ముగ్గులు, మ్యూజికల్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కొనిదెన గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామికి గ్రామోత్సవం నిర్వహించారు.

➤ జే.పంగులూరు మండలంలోని పంగులూరు గ్రామంలో ఆదివారం సంక్రాతి సంబరాలు అబ్బరాన్నంటాయి. మకర సంక్రాతి ఉత్తరాయణ పుణ్యకాల సమయంలో గ్రామంలో స్వయంభుగా వెలసిన పార్వతీ సమేత భీమ లింగేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, సాయిబాబ, పోతులూరి వీరబ్రహేంద్ర స్వాముల వారి ఉత్సవ మూర్తుల గ్రామం అంతా ఊరేగించారు.



అద్దంకిలో గోపూజ కార్యక్రమంలో పాల్గొన్న రోటరీక్లబ్ సభ్యులు



కొనిదెనలో చెన్నకేశవస్వామికి గ్రామోత్సవం



మల్లాయపాలెంలో బహుమతులు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పంగులూరు గ్రామంలో ఊరేగుతున్న ఉత్సవమూర్తులు



ఇంకొల్లులో ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులందజేస్తున్న నిర్వాహకులు



కారంచేడు గ్రామోత్సవంలో స్వామివారు



చినగంజాం: స్వామివారి ఊరేగింపు



మేదరమెట్లలో దుస్తులు పంపిణీ చేస్తున్న దాత

రంగవల్లులు, ఆటల పోటీలతో సంబరాలు..

పర్చూరు/యద్దనపూడి/మార్టూరు/చినగంజాం/కారంచేడు: నియోజకవర్గంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలు ముగ్గుల పోటీలు, ఆటల పోటీలతో ఉత్సాహంగా జరుపుకున్నారు. కారంచేడులో పెద బాజరు శివాలయం, వైష్ణవీదుర్గామాత ఆలయం, కట్టమల్లేశ్వరస్వామి ఆలయం, వెంకటేశ్వరస్వామిగుడి, సాయిమందిరం, సీతారామాలయంలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మండలంలోని స్వర్ణ వెంకటేశ్వరస్వామిగుడి, శివాలయం, వల్లభరాయస్వామివారి ఆలయంలోను భక్తులు ప్రత్యేక పూజలు చేసి స్వామివార్లను గ్రామోత్సవాలు నిర్వహించారు. స్వర్ణ గ్రామంలో చెస్, బాడ్మింటన్ వాలీబాల్, సైకిల్ స్లో, బైక్ స్లో, లాంగ్ జంప్, రన్నింగ్, ముగ్గుల పోటీలు పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులు కమిటీ సభ్యులు అందించారు.

➤ పర్చూరు మండల పరిధిలోని నూతలపాడు గ్రామంలోని రెడ్డిపాలెంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద రన్నింగ్, వీల్ చైర్ వంటి ఆటల పోటీలను నిర్వహించి బహుమతులు అందించారు.

➤ ఇంకొల్లు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఇంకొల్లు సాయిబాబా రోడ్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ చిన్నిపూర్ణారావు, కార్యదర్శిబదరీ నారాయణ, ట్రెజరర్ నరసింహ శెట్టి విజేతలకు బహుమతులు అందజేశారు. చినగంజాం గ్రామానికి చెందిన బాలిక ఆట్ల విష్ణుప్రియరెడ్డి వైఎస్సార్ సీపీ జెండాలోని మూడు రంగులతో వేసిన రథం ముగ్గుతో అందరినీ ఆకట్టుకుంది.

➤ మండల కేంద్రం చినగంజాంలో ఆదివారం స్థానిక భావన్నారాయణ స్వామి, చిదంబరేశ్వరాలయాలలో స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను వాహనాలపై ఉంచి ప్రత్యేకంగా అలంకరించి గ్రామాలలోని ప్రధాన వీధులలో ఊరేగింపు నిర్వహించారు. ముస్నం వారిపాలెం గ్రామంలోని రామాలయంలోని ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి మున్నంవారిపాలె, మూలగాని వారిపాలెం, చినగంజాం, కొత్త పాలెం గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం స్థానిక బాలకోటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో స్వామి వారి కొలనులో తెప్పోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు.



చినగంజాంలో వేసిన వైఎస్సార్ సీపీ రథం ముగ్గు

కన్నుల పండువుగా తెప్పోత్సవం



చింతపల్లిపాడులో తెప్పోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యద్దనపూడి/పర్చూరు/మార్టూరు: తెలుగు ప్రజలు ఎంతో ఉత్సాహంగా జరుపుకునే సంక్రాంతి సంబరాలు మండలంలో అంబరాన్నంటాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా పలు గ్రామాల్లో తెప్పోత్సవం నిర్వహించారు. సోమవారం యద్దనపూడి, పూనూరు, చింతపల్లిపాడు , చిమటవారిపాలెం గ్రామాల్లో స్వామివారి ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం చేసి స్థానిక చెరువుల్లో తెప్పోత్సవం నిర్వహించారు.

➤ పర్చూరు మండలంలో చెరుకూరు గ్రామంలో త్రివిక్రమ, అగస్తేశ్వరస్వామి వారల తెప్పోత్సవ కార్యక్రమాన్ని భాజ భజంత్రీలు, బాణసంచా, విద్యుత్ దీపాలంకరణతో ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామోత్సవం జరిపారు. కార్యక్రమంలో ఈఓ నాగయ్య, భక్తులు పాల్గొన్నారు.

➤ మార్టూరు మండలంలోని రాజుపాలెం గ్రామంలోని కోదండ రామస్వామి ఆలయంలో ఉత్సవ విగ్రహాలను ఆదివారం సాయంత్రం ఊరేగింపు నిర్వహించి స్థానిక చెరువులో తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు.



రాజుపాలెం చెరువులో తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

దగ్గుబాటిని కలిసిన ఆమంచి



దగ్గుబాటికి శుభాకాంక్షలు తెలుపుతున్న కృష్ణమోహన్

కారంచేడు: మాజీ మంత్రి, పర్చూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావును వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ కలిశారు. సంక్రాంతి పండుగను కుటుంబ సభ్యులతో కలసి స్వగ్రామంలో జరుపుకోవడానికి దగ్గుబాటి కుటుంబ సభ్యులు కారంచేడుకు వచ్చారు. దీంతో సంక్రాంతి పండుగ రోజు అయిన ఆదివారం ఆమంచి తన కుమారుడు సేతు వెంకయ్యనాయుడుతో కలసి దగ్గుబాటి ఇంటికి వచ్చారు. దగ్గుబాటికి, ఆయన కుమారుడు హితేష్ చెంచురామ్‌కు పుష్పగుచ్ఛాలు అందించి సంక్రాంతి సుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ జువ్వా శివ రామప్రసాద్, దగ్గుబాటి రామకృష్ణలున్నారు.

ఆమంచికి శుభాకాంక్షలు తెలిపిన వైఎస్సార్ సీపీ నాయకులు..

సంక్రాంతి పర్వదిన్నాన్ని పురష్కరించుకొని ఆదివారం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణ మోహన్‌ను కారంచేడు వైఎస్సార్ సీపీ నాయకులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, జడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీ శ్రీనివాసరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ జువ్వా శివ రామప్రసాద్, వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, దగ్గుబాటి రామకృష్ణ, ముల్లా నూర్ అహ్మద్, మండల కన్వీనర్ దండా చౌదరిబాబు, కారుమూడి సుబ్బారెడ్డి, గోగినేని సతీష్‌బాబు, యర్రం లక్ష్మారెడ్డి, చల్లా సుబ్బారెడ్డి, యార్లగడ్డ పాపారావు, వై శ్రీకాంత్, కొర్రపాటి అనీల్, కార్యకర్తలున్నారు.

చిన్ననాటి గుర్తులు చెరగని స్మృతులు



పూర్వ విద్యార్థుల సమూహం

వేటపాలెం: బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాల 1988–89 పదో తరగతి పూర్వ విద్యార్థులు సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నాగవరపమ్మ దేవస్థానం వద్ద అపూర్వ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 15 సంవత్సరాల కిందట విద్యార్థులందరం కలసి హృదయ వెల్ఫేర్ అసోసియేషన్‌గా ఏర్పడి అనేక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 15వ వార్షికోత్సవం నిర్వహించుకున్నామని చెప్పారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా నన్నపనేని సునీల్, వైస్ ప్రెసిడెంట్‌గా బొడ్డు శివయ్య, జాయింట్ సెక్రటరీగా ప్రత్తిపాటి భాస్కర్, జనరల్ సెక్రటరీగా గుగ్గిలం శ్రీహరి, ఆర్గనైజర్ అండ్ ట్రెజరర్‌గా పేరిశెట్ల బ్రహ్మయ్యలను ఎన్నుకున్నారు. అనంతరం పలువురిని సన్మానించారు. నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో ఇంకా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించారు. కార్యక్రమంలో మధు, సజ్జా కృష్ణ, దోగుపర్తి మల్లికార్జునరావు, దేవన దుర్గేష్, ధర్మకిషోర్, బైన నందకుమార్, బీఎస్ నాగేశ్వరరావు, వలపట్ల సురేష్, పీ. రాజగోపాల్ పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శుభకృత్ నామ సంవత్సరం. దక్షిణాయనం పుష్య మాసం విశాఖ నక్షత్రం దశమి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని శింగరకొండ దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంటల వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు.

జూదరుల అరెస్టు

మేదరమెట్ల: అనుమతి లేకుండా కోడిపందేలు ఆడుతున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండల కేంద్రం కొరిశపాడులో సోమవారం కోడి పందేలు ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్సై పీ వెంకటేశ్వరరావు దాడి చేసి నాలుగు కోళ్లు, రూ.510 నగదు స్వాధీనం చేసుకున్నారు. దాడిలో సిబ్బంది పాల్గొన్నారు.

వంశపారంపర్య ధర్మకర్త మృతి

పర్చూరు: మండల పరిధిలోని అడుసుమల్లి గ్రామంలో వేంచేసియున్న గంగా పార్వతి సమేత గౌరి శంకరస్వామి వార్ల దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త అడుసుమల్లి హనుమంతరాయుడు (70) ఆకస్మాత్తుగా శనివారం రాత్రి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సుమారు 40 ఏళ్ల పాటు ఆలయానికి ధర్మకర్తగా ఉన్నారని తెలిపారు. అలయ ధర్మకర్తగా ఎన్నో విశిష్ట సేవలు ప్రజల మన్ననలు పొందారని గ్రామస్తులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈయన మృతి తీరని లోటు అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

19న లైఫ్ సర్టిఫికెట్లు పంపిణీ

చినగంజాం: మండలంలోని విశ్రాంత రాష్ట్ర ఉద్యోగులకు జీవన ప్రమాణ పత్రాలు (లైఫ్ సర్టిఫికెట్) అందజేసే కార్యక్రమం ఈనెల 19 వతేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్థానిక భావన్నారాయణ స్వామి ఆలయంలో నిర్వహించనున్నట్లు మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఏడుగుండ్ల నాగేశ్వరరావు, గంటా వెంకటస్వామిలు తెలిపారు. బాపట్ల జిల్లా విశ్రాంత ఉద్యోగులు సంఘం ప్రెసిడెంట్ చెరుకూరి సుబ్బారావు, విశ్రాంత ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వరరావులు కార్యక్రమానికి హాజరై సర్టిఫికెట్లు జారీ చేయనున్నట్లు తెలిపారు. ఫ్యామిలీ పెన్షనర్, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ నంబర్, మొబైల్ ఫోన్ నంబర్, పెన్షన్ కార్డు నంబర్ తీసుకొని హాజరు కావాల్సిందిగా వారు కోరారు.